

# అమెరి'కాకమ్మ'కథలు

## వంగూరి చిట్టెన్ రాజు



# నేనూ - టీవీ నైనూ

అమెరికాకమ్మ కథలు- 18

**గత వారం రోజులుగా** నాకు ఒకానొక తెలుగు టీవీ ఛానెల్ వారి ఫుల్ టైం డ్రైవరుగా ప్రమోషన్ వచ్చింది. అఫ్ కోర్స్ ఆ ఉద్యోగం నేను కోరితెచ్చుకున్నదే. రాబోయే నెలా, రెండు నెలలలో మా హ్యూస్టన్ తెలుగు వారి గురించి ఆ టీవీ లో వచ్చే ప్రత్యేక కార్యక్రమాలలో "యూనిట్ డ్రైవర్ - రాజు" అని టైటిల్స్‌లో కనపడితే తప్పట్లు కొట్టండి. ఎందుకంటే, అది అస్మదీయుడే నా పేరు వేసినా, వెయ్యకపోయినా, ఈ మధ్య నా జాతకం టీవీ నైన్ వారి జాతకంతో బాగా పడినట్టుంది. అసలు విషయం ఏమిటంటే, గత నెలలో నా అభిమాని అయిన ఒకానొక టీవీ నైన్ పెద్దమనిషి కోరిక మీద, ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న టీవీ నైన్ యూనిట్ వారిని మా హ్యూస్టన్ ఆహ్వానించి, హ్యూస్టన్‌లో "తెలుగుదనం" అనే పేరుతో అరడజను కార్యక్రమాలని, వారి సంపూర్ణ సహకారంతో రూప కల్పన చేసి వారం రోజులు వారిని అన్ని చోట్లా తిప్పి, రకరకాల అంశాలతో చిత్రీకరణ చేశాం.

హ్యూస్టన్‌లో టీవీ నైన్ వారి ప్రత్యేక కార్యక్రమాలలో అస్మదీయుడితో ఇంటర్వ్యూ...అనగా నా సుందరవదనారవిందాన్నీ చిత్రీకరించడం ఒకటి. అసలు సమస్య అక్కడే వచ్చింది. ఎందుకంటే, వాళ్ళని రిసీవ్ చేసుకోడానికి వెళ్ళిన నన్ను ఎయిర్ పోర్ట్‌లో చూడగానే, వాళ్ళు ముగ్గురూ ఒకరినొకరు నీరసంగా చూసుకోడం గమనించుటయే కాక, "మిమ్మల్ని ఒక మాంఛి అమెరికా అందాలు కనపడే సీనిక్ ప్రదేశంలోనే ఇంటర్వ్యూ చెయ్యాలి సార్" అని ఏకగ్రీవంగా నాతో చెప్పగానే నా వాలకం మీద వారి అభిప్రాయం ఏమిటో కనిపెట్టేశాను. ఎంతయినా బ్రిలియంట్ ఫెలోని కదా! సీనిక్కూ, గీనిక్కూ అంటున్నారు కదా, ఈ ప్రపంచంలో మా ఇంటికన్నా సీనిక్కు వీళ్ళేక్కడ చూసి ఉంటారులే అనుకుని, వాళ్ళని మా ఇంటికి కూడా తీసుకెళ్ళాను, పోనీ ఆ నేపథ్యంలో అయినా నేను వారికి నచ్చుతానేమో అని. వాళ్ళు మా గార్డెన్‌లో ఉన్న చిన్నసైజు వాటర్ ఫౌంటెను ముందు నన్ను నుంచోబెట్టి, దాని చుట్టూ అరడజను సార్లు ప్రదక్షిణ చేయించి, రకరకాల ఏంగిల్స్ లో ప్రయత్నించి, "పోనీ మీ పరిచయం రేడియో పరిచయంలా ఉంటే బావుంటుందేమో సార్" అని ఒకరూ, "ఈ సీనరీ బానే ఉంది కానీ" అని నసుగుతూ మరొకరూ సూచనలు చేస్తూ "మీ మొహానికి ఈ నేపథ్యం కూడా చాలదు" అని వారు చెప్పకనే చెపుతున్న వాళ్ళ మొహాలు నేను చూశాక, వారి అభిప్రాయం ఏ మాత్రం మారలేదని గమనించాను. ఇలా లాభం లేదని, వాళ్ళని మా పక్క పేటలో ఉన్న న్యూటెరిటోరీ అనే అతి చక్కటి ప్రదేశానికి తీసుకెళ్ళాను. అక్కడ అనేక చెట్లూ, చేమలూ,

సరస్సులూ, వాటి చుట్టూ ముసలి వారు నడవడానికీ, పడుచువాళ్ళు పరిగెట్టడానికీ సిమెంటు మార్గమూ, ఆయాసం వచ్చినప్పుడు కూచోడానికి కర్ర బెంచీలూ, పట్టుకోడానికి చేపలూ కూడా ఉంటాయి.

ఇక తప్పదురా అనుకుని, అక్కడ చిత్రీకరణ సమయంలో కెమేరా వారూ, ప్రొడ్యూసర్ గారూ నేను చూడడం లేదు అనుకుని, గూడు పుఠాణీ చేసుకుని, నేను అద్భుతంగా నా గొప్పలు చెప్పుకుంటూ సమాధానం చెపున్నప్పుడు కూడా, ప్రశ్నలు అడిగే రమ్య చక్కటి మొహాన్నీ క్లోజప్ లోనూ, పక్కనే ఉన్న మాంచి ఫౌంటెన్లూ, జలపాతాలమీదా కెమెరా పెట్టేసి, లాంగ్ షాట్‌లో కేవలం నా గొంతుక మాత్రమే వినపడేలా చిత్రీకరించడం గమనించి, కించిత్తు విచారించాను. ఆ విధంగా విచారిస్తున్న నా వదనారవిందాన్ని చూపిస్తారా, చిరంజీవి వలె విలాసంగా నేను నడుస్తున్నప్పుడు తీసిన నా అరికాళ్ళ దృశ్యాలు చూపిస్తారా, లేదా ఈ టేపింగ్ సమయంలో చెట్టు ఎక్కుతూ, ఒకసారి ముగ్గురినీ చూసి ఆనందపెట్టిన ఒకానొక ఉడత మొహం, టీవీ వారి కెమేరా అక్కడే ఉందని తెలియక అమాయకంగా ఎగురుతున్న అమెరికాకుల బృందాన్ని, లేదా ఆ సరస్సులో ఊసులాడుకుంటూ మా మొహాలు బొత్తిగా గమనించని బాతుల మొహాల్నీ చూపిస్తారో తెలియదు. అనగా, నెలా రెండు నెలలలో వచ్చే హలో అమెరికా అనే కార్యక్రమంలోనో మరేదో టీవీ నైన్‌లో మీరు నా మీద ప్రత్యేక ప్రసారం చూసినప్పుడు, ఉడత మొహమూ, మరియు అమెరికాకులు విహరిస్తుండగా వెనక నేపథ్యంలో నా ''స్వోనూ'', నా ఫేసు ఎక్కడో హీరోకి అరమైలు వెనకాల గంతులేస్తున్న డాన్స్ కుర్రాడిలా లాంగ్ షాట్ లోనూ, కనపడితే, యువర్ ఆనర్, ఐ రెస్ట్ మై కేస్!

ఈ షూటింగు అయిపోయిన తరవాత, ఈ బృందం హ్యూస్టన్‌లో ఉన్న వారం రోజులలోనూ, నా సుందరముఖారవిందం మీద వారి అభిప్రాయం స్పష్టంగా తెలియక, నేను గిజగిజ లాడిపోయి, ఇక ఉండబట్ట లేక, ఏమైనా తప్పులు చెపుతూ సవరించుకుందాం అనే వంక చెప్పి, ఒక స్కాచ్ పోయించే నెపంతో పక్కకి పిలిచి, ''నాయనా, మొన్న తీసిన నా ''తెలుగు తేజం'' ఇంటర్వ్యూ చూపిస్తారా?'' అని కెమేరామన్ గారిని అడిగాను. మూడు స్కాచ్‌ల తరవాత, ఎంతో సావధానంగా కేవలం ఒకే ఒక చిన్న సైజు చెంచా తాగుతూ, మూడు వేల చెంచాల తరువాత అతను నాకేసి అదోలా చూసి ''ప్రొడ్యూసర్ గారిని అడగండి సార్'' అన్నాడు. చెంచాలతో స్కాచ్ ఆస్వాదన గిన్నెస్ బుక్‌లోకి ఎంపిక అయితే, ఆ సమయంలో నేను పడిన నరకయాతనకి నందీ వారి ''సహజనటనా రాజాధిరాజు'' ఎవార్డు వచ్చి తీరాల్సిందే. ఇక్కడ సమస్య ఏమిటంటే, ఏ స్కాచ్ అయినా, సారా అయినా, కిక్కు వచ్చి నిజం కక్కడానికి గుటుక్కుమని ఒకే గుక్కలో తాగాలి కానీ, కక్కుర్తిగా మొక్కుబడికి గుట్కాలా ఒక్కొక్క స్పూనూ తాగితే కిక్కూ లేదు, నిజానిజాల కక్కుళ్ళూ లేవు కదా! ఈ మందు ప్రభావం ఈ కుర్రాడి మీద ఏ కోశానా లేదని గమనించి, ''అయ్యయో, జేబులో డాలర్లు'' పోయిన కారణం చేత, నా మొహం టీవీలో ఏ విధముగా వచ్చునూ అనే కాంక్ష క్రెడిట్ కార్డ్ మీద చేసిన అప్పు మీద చక్రవడ్డీలా గంట గంటకీ పెరిగిపోయింది. అప్పుడు నా ప్లాన్ బీ అమలు పరిచాను.

అదేమిటంటే, సదరు టీవీ నైన్ వారి రిపోర్టర్ అమ్మాయి ఎందుకో తెలియదు కానీ ఎయిర్ పోర్ట్ లోనే నన్ను చాలా ఆప్యాయంగా పలకరించి, ఆ వారం రోజులూ మనసు మార్చుకోకుండా తన ఆప్యాయం ప్రవర్తన కంటిన్యూ చేసింది. పైగా వెయ్యి మైళ్ళు డ్రైవర్ రాజు ఉద్యోగం చేసిన నా మీద జాలి కొంచెం అయినా ఉండకపోతుందా, నన్ను కనికరించక పోతుందా అని నా సహజ నటుడి టోపీ పెట్టుకుని, తండ్రి గుమ్మడి కోడలు సావిత్రిని చూసినట్టుగానూ, లేదా కలర్ మాయా బజార్ చూద్దామా మా అమ్మాయిల్ని అడిగినట్టుగానూ ఓ ఆత్మీయ భరిత లుక్ పారేసి, ''అందమైన ఓ అమ్మాయీ, ఇప్పటి దాకా నిన్ను టీవీ లో నేను చూడ లేదు. టీవీలో నువ్వు ఎలా కనపడతావో చూద్దామని మా క్వీన్ విక్టోరియా భలే ముచ్చట పడుతోంది. మొన్న తీసిన నా ''తెలుగు తేజం'' ఇంటర్వ్యూ అందరం కలిసి సరదాగా చూద్దామా'' అని ఎంతో ప్రేమగా అడిగాను. ''ష్యూర్ అంకుల్, ప్రొడ్యూసర్‌గారిని అడిగి, ఆయన ఒప్పుకుంటే అందరం కలిసే చూద్దాం'' అని నా మొహం చూడకుండా తన మొహం...యస్, పైన ఎక్కడో ఆకాశంలో ఎగురుతున్న అమెరికాకుల కేసి

తిప్పేసింది. అది సరిగ్గా సావిత్రి గుమ్మడినీ, మా అమ్మాయి నన్నూ చూసిన ఫీలింగే! పైగా అంకులూ, పెంకులూ అంటూ సంబోధన ఒకటీ. చెప్పొద్దూ, నన్ను ఎవరైనా అలా పిలిస్తే ఒళ్ళు మండుతుంది.

ఇక అన్ని ప్రయత్నాలూ విఫలమయ్యాక, డాక్టర్ ఇచ్చిన మందులు వికటించిన తరువాత వచ్చే చావు తెలివి నాకు వచ్చేసింది. స్కాచ్ మందు మరియు ఆప్యాయం ఫీలింగూ కలిపి రంగరించి పోసినా ప్రొడ్యూసర్ గారి దగ్గిర ద్రావకం ఏ మాత్రమూ పనిచెయ్యదు అని తెలిసిపోయింది. ఎందుకంటే మానవుడు ఆరంజ్ జ్యూస్ మాత్రమే సేవించును. ఆ రెండవ భాగం ఆయన దగ్గర అసలూ ఏ మంత్రమూ పని చెయ్యదు, ఎందుకంటే, కెమేరాతో అందరినీ, అన్నింటినీ ఎడా, పెడా షూట్ చేసి పారేసి, హైదరాబాదు పంపించెయ్యడమే తన ఉద్యోగం అనీ, కొందరి మొహాల బదులు అమెరికా ఉడత అమెరికా డాలరు చెట్టు ఎక్కుట చూపిస్తే రేటింగులు ఎంత పెరుగుతాయో నిర్ణయించుట హైదరాబాదులో స్థానిక అధికారులూ, ఎడిటర్ గారూ, టివీ నైన్ అధినేత రవి ప్రకాష్ గారూ కలిసి ఏది ప్రసారం చేస్తారో, లేదా మొత్తం అంతా చెత్త బుట్టలో పారేస్తారో తనకి కూడా తెలియదనీ అని ప్రొడ్యూసర్ గారు నాతో పదే, పదే చెప్పుటయే కాక, మేము కెమేరాతో అమెరికాలో తీయుటకూ, అక్కడ ఆంధ్రాలో టీవీలో వేయుటకూ ఏమీ సంబంధం లేదని హ్యూస్టన్ ప్రజానీకానికి చెప్పి ఎవరి చేతా దెబ్బలు తినకుండా మిమ్మల్ని మీరే కాపాడుకోండి, లేదా జరగబోయే మీ బాడీ డేమేజీకి టీవీ నైన్ బాధ్యత వహించదు అని ఆయన చెప్పకనే పలుమార్లు నాతో చెప్పారు. అందుకే నేను అటు కెమేరావారు, ఏంకరు గారి దగ్గరనుంచి నరుక్కు వద్దామనుకుని ఇరుక్కు పోయాను. ఇందుమూలంగా, నేను తెలియజేయునది ఏమనగా, ఎవరినైనా, ఎప్పుడైనా, ఏ టీవీ వారైనా షూటింగ్ చేస్తే, ఆ మర్నాడు టీవీలో పడిపోయి తెలుగు ప్రేక్షక లోకాన్ని తమ అందచందాలతో ఉర్రూతలూగించేస్తామనుకుని భ్రమ పడి ఓవర్ ఏక్షన్ చేసెయ్యకండి. నా లాగా, కార్టూన్ సినిమాల లాగా, ఉడత తెర మీది కొచ్చి, నా గొంతుకతో మాట్లాడే అవకాశం చాలానే ఉంది. పైగా ఇటువంటి విషయాలు అడ్డమైన వాళ్ళకీ చెప్పకూడదని చెపుతూనే ఈ ప్రొడ్యూసర్ గారు నాకు చెప్పారు.

తామే కాకుండా టీవీ నైన్ వారు కూడా నన్ను అడ్డమైనవాళ్ళ లిస్టులో వేసేశారు సుమా అని నా గాఢ మిత్రులూ - గూఢ శత్రువుల కేటగిరీలో వారూ, వారి బాహుమూలాల రుచి చూస్తూ బ్రహ్మానందం అనుభవిస్తున్న అనుయాయులూ సంతోషిస్తారని నాకు తెలుసు. ఇక ఏకంగా తెలుగు తేజం అనే పేరుతో నన్ను టీవీ నైన్‌లో చూస్తే వారందరూ ఎంత గర్భశోకం అనుభవిస్తారో. తమలో తామే అనగా తమ గేటెడ్ కమ్యూనిటీలలో విమర్శిస్తూ ఎంత ఆనందిస్తారో కూడా ఊహించగలను. అన్నట్టు "హాస్యానికీ, అపహాస్యానికీ తేడా ఏమిటి?" అని టీవీ నైన్ వారు నన్ను ఒక ప్రశ్న అడిగారు. "నేను ఎవరినైనా తిడితే అది ఉన్నతమైన హాస్యం. ఎవరైనా నన్ను తిడితే అది అపహాస్యం " అని సరదాగా సమాధానం చెప్పాను.

మొత్తానికి అన్ని షూటింగులూ అయిపోయాక, ముగ్గురినీ ఎయిర్ పోర్ట్‌లో దింపి, క్వీన్ విక్టోరియాని చూసి వారం దాటిపోయిందే అని హఠాత్తుగా గుర్తుకొచ్చి హడిలి చస్తూ ఇంటికి వెళ్ళగానే ఎక్కడో ఆకాశ వాణి గొంతుక వినపడింది.

"దురద తీరిందా, ఇంకా మిగిలిందా?"

ఆకాశవాణి స్వరమూ, క్వీన్ విక్టోరియా గొంతుకా ఒక్కలాగే ఉంటాయి అని నాకు మొట్టమొదటిసారి తెలిసింది.

"కనీసం ఆ ఛానెల్ పేరు అచ్చు గుద్దిన టోపీ అయినా ఇచ్చారా, నువ్వు చేసిన డ్రైవర్ ఉద్యోగానికి? " - మరొక ఆకాశవాణి ప్రశ్న.

ఏది ఏమైతేనేం, ఆ టీవీ నైన్ అమెరికా యూనిట్ బృందం ప్రొడ్యూసర్ హరి కృష్ణ, కెమేరామన్ శ్రీనివాసూ, విలేఖరి రమ్య నాకు భలే నచ్చారు. వారికి నా ఆత్మీయ శుభాభివందనలు. వారు కలకాలం అలా హాయిగా నవ్వుతూ, కలిసి మెలిసి పనిచేస్తూ మంచి కార్యక్రమాలు తీస్తూనే ఉన్నంతకాలం నేను చూస్తూనే ఉంటాను టీవీ నైన్.

✡ ✡ ✡